క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రేగిడి: రాజాం ప్రధాన రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థి భేరి రవితేజ కుటుంబాన్ని ఎమ్మెల్యే కంబాల జోగులు పరామర్శించారు. శనివారం మండలంలోని పెద్దకోడిశ గ్రామానికి వెళ్లి, రవితేజ తల్లి లక్ష్మిని కలిసి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. అన్ని విధాలా అండగా ఉంటామని, ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందజేస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట రేగిడి వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, రేగిడి పీఏసీఎస్ అధ్యక్షుడు నెల్లి పెంటన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



గర్భిణికి వ్యాధి నిరోధక టీకా వేస్తున్న ఏఎన్ఎం ప్రశాంతి

తెర్లాం: గర్భిణులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వైద్యుల సూచనల మేరకు టీకాలు వేయించుకోవాలని తెర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక రెండో అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు శనివారం టీకాలు వేశారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించిన ఆయన గర్భిణులు తరచూ ఆరోగ్య తనిఖీలు చేయించుకోవాలని, సక్రమంగా మందులు వాడడం, పౌష్టికాహారం తీసుకోవడం వంటివి చేయాలన్నారు. స్థానిక పీహెచ్‌సీలోనే ప్రసవాలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ప్రశాంతి, ఎంపీహెచ్ఏ వై.శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు జి.లక్ష్మి, వై.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

'చలో విజయవాడ' వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు వేణుగోపాలనాయుడు

బొబ్బిలి: విజయవాడలో ఈ నెల 21, 22వ తేదీల్లో జరిగే ఏపీఎన్‌జీవో 21వ రాష్ట్ర కౌన్సిల్ మహాసభలకు సంబంధించి రూపొందించిన చలో విజయవాడ వాల్‌పోస్టర్‌ను వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు శనివారం ఆవిష్కరించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో గొర్లె సూర్యనారాయణ, బురిడి రామారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్థాయిలో అన్నిరకాల వైద్యసేవలు



రామభద్రపురం పీహెచ్‌సీలో దంత వైద్యపరీక్షలు చేస్తున్న దంత వైద్యాధికారి నాగశేఖర్

రామభద్రపురం: గ్రామ స్థాయిలోనే అన్ని రకాల వైద్యసేవలను ప్రభుత్వం అందిస్తోందని దంత వైద్యాధికారి నాగశేఖర్ అన్నారు. శనివారం స్థానిక పీహెచ్‌సీలో పలువురికి దంత వైద్య పరీక్షలు చేసిన ఆయన హెల్త్ అండ్ వెల్‌నెస్ స్కీమ్ కింద పీహెచ్‌సీల్లో దంత వైద్యసేవలు అందించడం జరుగుతోందని తెలిపారు. దంత వైద్యులు వారానికోసారి ప్రతీ పీహెచ్‌సీని సందర్శిస్తూ అక్కడే డెంటల్ క్లినిక్‌లు నిర్వహించడం జరుగుతోందన్నారు. ఏ చిన్నపాటి దంత సమస్య వచ్చినా పీహెచ్‌సీలోనే చికిత్స చేయించుకోవచ్చన్నారు. మండలంలోని దంత సమస్యలు ఎదుర్కొంటున్న రోగులకు ప్రతీ శనివారం రామభద్రపురం, ఆరికతోట పీహెచ్‌సీల్లో తనిఖీలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామన్నారు.

విద్యాహక్కు చట్టంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబు

రాజాం సిటీ: విద్యాహక్కు చట్టంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు తెలిపారు. స్థానిక ప్రభుత్వ వసతి గృహంలో మండల న్యాయసేవాధికార సంఘం ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో కీలకమైందని, జీవితంలో ఎన్నో విషయాలు విద్య ద్వారా నేర్చుకోవచ్చన్నారు. పౌరులకు ప్రాథమిక హక్కులతో పాటు విధులు కూడా ముఖ్యమేనన్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలించడంతో పాటు బాల్యవివాహాలను అరికట్టేందుకు విద్యార్థులు తమవంతు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి కృష్ణ సాయితేజ, న్యాయవాదులు రెడ్డి విజయ్‌కుమార్, ముదిలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమం

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు



బొద్దాంలో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: నవరత్నాలు(సంక్షేమ పథకాలు)తో గడప గడపకూ సంక్షేమం అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలో బొద్దాం గ్రామంలో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఓ వైపు గ్రామ సచివాలయాల ద్వారా ప్రతీ గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టడం, మరోవైపు అన్ని వర్గాలకు మేలు జరిగేలా సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతోందన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమన్నారు. పథకాల రూపంలో ప్రతీ ఇంటికి సగటున ఏడాదికి రూ.1 లక్షకు మించి ప్రభుత్వ సాయం అందిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 99 శాతం హామీలు నెరవేర్చి, సీఎం జగనన్న రికార్డు సృష్టించారన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఆఖరికి పచ్చా చొక్కాల వారికే పథకాలు అందేవని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని నమ్మి ఓట్లు వేస్తే భవిష్యత్ అంధకారంగా మారుతుందని ప్రజలు గమనించాలని కోరారు. రానున్న ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజాం మండల కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, సర్పంచ్ నక్క తవిటమ్మ, వైస్ ఎంపీపీ నక్క వర్షిణి, వీవర్స్ సొసైటీ ప్రెసిడెంట్ కనకం శ్రీను, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నక్క సత్యనారాయణ, డైరక్టర్ నక్క ఉమామహేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, ఎంపీడీఓ బాసూరీ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

జి.ఎన్.పురంలో 'వైఎస్సార్ పొలంబడి'



రేగిడి: వరినాట్లు వేసే విధానంపై అవగాహన కల్పిస్తున్న ఏవో మురళీకృష్ణ

సంతకవిటి: మండలంలోని జి.ఎన్.పురంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం శనివారం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి పి.నవీన్ సాగులో అధిక దిగుబడుల సాధనకు పలు సలహాలు, సూచనలతో పాటు కొన్ని మెలకువలు నేర్పించారు. వరి పంటను ఆశించే చీడపీడలు గుర్తించి, సాగులో యాజమాన్య పద్ధతులను ప్రత్యేక చార్టుల ద్వారా వివరించారు.

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం శనివారం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ వరినాట్లు వేయడంపై అవగాహన కల్పించారు. అలాగే పంటను ఆశించే చీడపీడలు, తెగుళ్ల నివారణకు సూచనలు చేశారు. వరి సాగులో కాలిబాటలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా పంటకు గాలి, వెలుతురు బాగా తగలడంతో పాటు ఎరువులు కూడా సక్రమంగా అందుతాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ కరణం గోవిందరావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ కెంబూరి శ్రీనివాసరావు, ప్రకృతి వ్యవసాయం పీఆర్‌పీలు పైల తవిటినాయుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువరాదు



అమర జవాన్ శ్రీను తల్లిదండ్రులను సన్మానిస్తున్న గ్రామస్తులు

తెర్లాం: అమరవీరుల త్యాగాలు మరువరాదని లింగాపురం సర్పంచ్ బూరాడ తవిటినాయుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు కోట చినసత్యనారాయణ అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ పురస్కరించుకుని, నేలతల్లికి వందనం–వీరులకు వందనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని అంట్లవార గ్రామంలో దివంగత జవాన్ గుల్లిపల్లి శ్రీను తల్లిదండ్రులు తవిటినాయుడు, లక్ష్మిలను శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు సైతం లెక్క చేయకుండా అమరులైన జవానుల సేవలను ఎల్లప్పుడూ జ్ఞాపకం చేసుకోవాలని, వారి సేవలను ఎప్పుడూ గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి జేఈ త్రినాధనాయుడు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

సంతకవిటి: మండలంలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, మండల అభివృద్ధికి కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి కె.పద్మలత కోరారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఆమె ఈ నెలాఖరులోగా సచివాలయాల నిర్మాణాలను పూర్తి చేయాలని తెలిపారు. నాడు–నేడు పనులు, గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమం నిధులతో జరిగే పనులను వేగవంతం చేయాలన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- ఎమ్మెల్యే కంబాల జోగులు



వైఎస్సార్ పార్కులో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు, తదితరులు

రాజాం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్, నా మట్టి–నా దేశం కార్యక్రమాల్లో భాగంగా మండల కేంద్రంలోని వైఎస్సార్ పార్కు వద్ద శనివారం ఆయన పలు మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్కులు, ప్రధాన రోడ్లు, చెరువుల గట్లు, దేవాలయాల ఆవరణలో మొక్కలు పెంచాలన్నారు. మొక్కల పెంపకంపైనే మానవ మనుగడ ఆధారపడి ఉందని, ఈ నేపథ్యంలో ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి, పెంచిపెద్ద చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్‌శాఖ విశాఖపట్నం ఆర్‌డీ జి.నాగరాజు, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, మేనేజర్ నాగరాజు, ఆర్ఐ చక్రవర్తి, ఎన్విరాన్‌మెంట్ ఏఈ భాగ్యలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ రాజాం టౌన్, రూరల్ కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, రాజాం పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్లోరినేషన్ తప్పనిసరిగా చేపట్టాలి

తెర్లాం: గ్రామాల్లోని నేలబావులన్నింటిలో తప్పనిసరిగా క్లోరినేషన్ చేపట్టాలని వైద్యారోగ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, ఈఓపీఆర్‌డీ రాంబాబు, తెర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డి శ్రీనివాసరావు ఆదేశించారు. శనివారం స్థానిక మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లోని నేలబావుల్లో క్లోరినేషన్ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు నేలబావుల్లో క్లోరినేషన్ చేపట్టాలని, ఇలా చేసిన నీటిని తాగడం ద్వారా ఎటువంటి వ్యాధులు సోకవన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో నీరు కలుషితమై ప్రజలు వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందని, ఈ నేపథ్యంలో క్లోరినేషన్ చర్యలు ముమ్మరం చేయాలని తెలిపారు.

పంచాయతీ ఉప ఎన్నికల్లో..
వైఎస్సార్ సీపీ మద్దతుదారుల విజయకేతనం

పంచాయతీ ఉప ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ మద్దతుదారుల హవా కొనసాగింది. శనివారం పలుచోట్ల సర్పంచ్, వార్డు మెంబర్ల స్థానాలకు పోలింగ్ జరిగింది. ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తి, తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. సాయంత్రం ఫలితాలు వెల్లడి కాగా మెజార్టీ స్థానాల్లో అధికార పార్టీ మద్దతుదారులే విజయకేతనం ఎగురవేసి, సంక్షేమ పాలనకు ప్రజలు పట్టంగట్టారని నిరూపించడం విశేషం.

- పంచాయతీ ఉప పోరులో అధికార పార్టీ విజయదుందుభి
- ఓనెఅగ్రహారం సర్పంచ్, నాలుగు వార్డు మెంబర్ల ఎన్నికల్లో గెలుపు
- లక్ష్మీపేట సర్పంచ్ ఎన్నికలో టీడీపీ మద్దతుదారు విజయం
- భారీ పోలీస్ బందోబస్తు నడుమ పోలింగ్, ఫలితాల వెల్లడి



వంగర: ఓనె అగ్రహారం సర్పంచ్‌గా ఎన్నికైన రుక్మిణమ్మకు ధ్రువపత్రం అందజేస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి బలరాం



వంగర: లక్ష్మీపేట పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసచక్రవర్తి

వంగర: మండలంలో రెండు సర్పంచ్, నాలుగు వార్డు మెంబర్ల స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో ఒక సర్పంచ్ స్థానంతో పాటు నాలుగు వార్డు మెంబర్ల స్థానాలను వైఎస్సార్ సీపీ మద్దతుదారులు కైవసం చేసుకున్నారు. ఓనె అగ్రహారం గ్రామ పంచాయతీ సర్పంచ్ ఉప ఎన్నికలో వైఎస్సార్ సీపీ మద్దతుదారు కాబోతుల రుక్మిణమ్మ టీడీపీ మద్దతుదారుపై 301 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. లక్ష్మీపేటలో టీడీపీ మద్దతుదారు ఆవు సుజాత (కళ్యాణి) వైఎస్సార్ సీపీ మద్దతుదారు వాన నారాయణమ్మపై 67 ఓట్లతో గెలుపొందారు. ఓనెఅగ్రహారం సర్పంచ్ ఉప ఎన్నికలో మొత్తం పోలైన ఓట్లు 403 కాగా, వైఎస్సార్ సీపీ మద్దతుదారుకి 351, టీడీపీ మద్దతుదారుకి 50 ఓట్లు పోలయ్యాయి.

నాలుగు వార్డు మెంబర్ల స్థానాల్లో..

కొప్పరవలస, కొట్టిశ, ఇరువాడ పంచాయతీల్లోని మూడు వార్డు మెంబర్ల స్థానాల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రుషింగిలో జరిగిన వార్డు మెంబరు స్థానానికి వైఎస్సార్ సీపీ, జనసేన పార్టీలకు చెందిన అభ్యర్థులు పోటీపడగా, వైఎస్సార్ సీపీ మద్దతు పలికిన అభ్యర్థి యలకల రాము 36 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. రుషింగిలో మొత్తం ఓట్లు 136 కాగా 89 ఓట్లు పోలయ్యాయి. వైఎస్సార్ సీపీ మద్దతుదారుకు 62, జనసేన మద్దతుదారుకు 26 ఓట్లు రాగా, చెల్లని ఓటు ఒకటిగా నమోదయ్యాయి.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు..

ఎన్నికల వేళ ఒకరిపై ఒకరు రెచ్చగొట్టే వ్యాఖ్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని చీపురుపల్లి డీఎస్పీ ఎ.శ్రీనివాసచక్రవర్తి హెచ్చరించారు. పంచాయతీ ఉప ఎన్నికలు జరిగిన ఓనెఅగ్రహారం, లక్ష్మీపేట గ్రామాల్లో శనివారం పర్యటించిన ఆయన అక్కడి పోలీస్ బందోబస్తును పరిశీలించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయని, దీనికి సహకరించిన గ్రామస్తులు, సిబ్బందిని అభినందించారు. అయితే ఎన్నికలు జరిగిన గ్రామాల్లో పోలీస్ బందోబస్తును కొనసాగించాలని సీఐ ఉపేంద్రరావును ఆదేశించారు. గ్రామాల్లో ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో విజయోత్సవ ర్యాలీలు నిషేధమని, అటువంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేయాలన్నారు.

బాడంగి: మండలంలోని పాల్తేరు పంచాయతీ వార్డు మెంబర్‌గా వైఎస్సార్ సీపీ మద్దతుదారు పూడి సత్యవతి విజయం సాధించారని స్టేజ్–2 రిటర్నింగ్ అధికారి ఎం.రాజేశ్వరి ప్రకటించారు. మొత్తం 180 ఓట్లకు గాను 120 ఓట్లు పోలయ్యాయని, వీటిలో రెండు చెల్లని ఓట్లు, ఒకటి నోటాకు వేసినదిగా గుర్తించారు. చెల్లుబాటు అయిన ఓట్లలో సత్యవతికి 78 ఓట్లు, ప్రత్యర్థి, టీడీపీ మద్దతుదారు లక్ష్మికి 39 ఓట్లు వచ్చాయి.

బొబ్బిలి: మండలంలోని కొండదేవుపల్లి రెండో వార్డు ఉప ఎన్నిక పోలింగ్ శనివారం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా ఎం.శంకరరావు వ్యవహరించగా, ఎంపీడీఓ రవికుమార్, ఈఓపీఆర్‌డీ భాస్కరరావు తదితరులు తమ సిబ్బందితో పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. ఈ ఎన్నికలో గ్రామానికి చెందిన టీడీపీ మద్దతుదారు పూతి సత్యనారాయణ గెలుపొందారు. ఈ వార్డులో మొత్తం 116 ఓట్లు పోలవ్వగా, సత్యనారాయణకు 71, ప్రత్యర్థి, వైఎస్సార్ సీపీ మద్దతుదారు రంభ లక్ష్మికి 45 ఓట్లు వచ్చాయి.



వంగర: రుషింగిలో గెలుపొందిన అభ్యర్థి రాముకు ధ్రువపత్రం అందజేస్తున్న దృశ్యం



బొబ్బిలి: గెలుపొందిన అభ్యర్థికి ధ్రువపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారులు

పశువుల సంతలో అన్ని వసతులు ఉన్నాయి..

- మున్సిపల్ ఆర్‌డీ నాగరాజు



సంత మార్కెట్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డీ నాగరాజు, తదితరులు

రాజాం: పశువుల సంతలో అన్ని వసతులు ఉండాలని మున్సిపల్ శాఖ విశాఖపట్నం రీజనల్ డైరెక్టర్ జి.నాగరాజు సూచించారు. స్థానిక పట్టణంలోని మల్లిఖార్జున కాలనీ వద్ద ప్రతీ గురువారం జరుగుతున్న సంత మార్కెట్ స్థలాన్ని ఆయన శనివారం పరిశీలించి, అక్కడ కల్పిస్తున్న వసతులుపై ఆరాతీశారు. పశువులను ఎక్కించే ర్యాంపులు, తాగునీటి సదుపాయం నిమిత్తం ఏర్పాటు చేసిన కుండీలు, మైదానాన్ని చూసి, సంత మార్కెట్ విశాలంగా ఉందని, వసతులు కూడా ఉన్నట్లు గుర్తించామన్నారు. అయితే ఈ సంతలో పాడి పశువులకు కావాల్సిన కనీస వసతులు లేవని, సంత నిర్వహణకు అనుమతులు లేవని తదితర అంశాలతో వచ్చిన ఫిర్యాదుల మేరకు సంత మార్కెట్ ప్రాంతాన్ని పరిశీలించాల్సి వచ్చిందన్నారు. సంత నిర్వహణకు మున్సిపల్ కార్యాలయం నుంచి అనుమతులు ఉండడంతో పాటు సంతలో విశాలమైన ప్రాంతం ఉందన్నారు. ప్రతీ గురువారం సంత ముగిసిన వెంటనే పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని శానిటరీ అధికారులకు ఆదేశించామన్నారు. పాడి పశువుల రవాణా విషయంలో మాత్రం వ్యాపారులు, రైతులు జాగ్రత్తలు పాటించాల్సి ఉందని, ఈ మేరకు అన్ని శాఖల అధికారులకు సూచనలు ఇచ్చామన్నారు. అనంతరం ఫిర్యాదుదారులను పిలిపించి, మాట్లాడారు. రైతులకు ఉపయోగపడే సంత విషయంలో తప్పుడు ఫిర్యాదులు చేయొద్దని, రైతులకు ఉపయోగపడే సూచనలు, సలహాలు చేయాలన్నారు. ఏపీ స్టేట్ యానిమల్ వెల్ఫేర్ బోర్డు సభ్యుడు కె.రవీంద్ర రెడ్డి మాట్లాడుతూ 110 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ సంత ప్రతిష్టను తప్పుడు ఫిర్యాదులతో దెబ్బతీయవద్దని హితవు పలికారు. తమ పరిశీలనలో సంత మార్కెట్ బాగానే ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, మేనేజర్ నాగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్, పశుసంవర్ధక శాఖ ఏడీ జయప్రకాష్, ఎస్ఐ లీలావతి, ఆర్ఐలు చక్రవర్తి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు స్థలమిస్తే..
ప్రతిపక్షాలకు ఎందుకంత కడుపుమంట?



మాట్లాడుతున్న రైతు సంక్షేమ సంఘ అధ్యక్షుడు లక్షుంనాయుడు

బొబ్బిలి: పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయిస్తే ప్రతిపక్షాలకు ఎందుకంత కడుపుమంట అని రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్షుంనాయుడు ప్రశ్నించారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడిన ఆయన గ్రోత్ సెంటర్‌లో పరిశ్రమలు పెడతామని భూములు తీసుకున్న వారు పరిశ్రమలు పెట్టకుండా పరారవుతుంటే పరిశ్రమల ఏర్పాటుకు ముందుకువచ్చిన సత్య బయో కెమికల్స్‌కు ప్రోత్సాహక ధరకే భూములు కేటాయించడం తప్పెలా అవుతుందన్నారు. పరిశ్రమలు వస్తే పది మందికి ఉపాధి కలుగుతుందనే మంచి ఆలోచన ఉండాలని హితవుపలికారు. వీలైతే మరింత మందిని ప్రోత్సహించి, పరిశ్రమల ఏర్పాటుకు చొరవ చూపాలన్నారు. ప్రతీ దానిపై ప్రతిపక్షాలు చౌకబారు ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో రాంబార్కి తిరుపతి, రవి, సూర్యనారాయణ, అప్పలనాయుడు, ఎస్.కృష్ణ, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబు

రాజాం సిటీ: స్థానిక కోర్టు సముదాయంలో సెప్టెంబర్ 9వ తేదీన జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు కోరారు. ఇదే విషయమై స్థానిక కోర్టు సముదాయంలో న్యాయవాదులు, రెవెన్యూ, బ్యాంక్, పోలీస్ సిబ్బందితో శనివారం సమావేశమైన ఆయన రాజీకాదగ్గ కేసులపై ఇరువర్గాలకు అవగాహన కల్పించి, కేసుల రాజీకి వచ్చేలా చూడాలని తెలిపారు. రాజీకి అనుకూలమైన సివిల్, క్రిమినల్, ప్రీ–లిటిగేషన్ కేసులన్నీ ఇరుపార్టీల అంగీకారంతోనే పరిష్కరించనున్నామన్నారు. సివిల్ కేసులు పరిష్కారమైతే కోర్టు ఫీజు వాపసు కూడా ఇవ్వనున్నామన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పి.ఎస్.వి.బి.కృష్ణసాయితేజ, తహసీల్దార్ ఎస్.కె.రాజు, రేగిడి డీటీ శ్రీనివాసరావు, ఏజీపీ ఎస్.పోలారావు, ఎస్ఐ పి.నీలావతి, ఎస్ఈబీ ఎస్ఐ ఎస్.పిచ్చేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

విద్యాప్రమాణాలు మెరుగుపరచాలి

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపరచాలని ఎమ్మెల్యే కంబాల జోగులు ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం మండలంలోని పెద్దకోడిశ జెడ్పీ ఉన్నత పాఠశాలను పరిశీలించిన ఆయన విద్యార్థుల వద్దకు వెళ్లి, వివిధ ప్రశ్నల ద్వారా వారి విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థుల చదువు కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందని, వాటిని సద్వినియోగం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.

గృహనిర్మాణాలను వేగవంతం చేయాలి

రాజాం: జగనన్న కాలనీ గృహనిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ బాసూరీ శంకరరావు సూచించారు. మండలంలోని అంతకాపల్లి గ్రామంలో జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై శనివారం సమీక్షించిన ఆయన లబ్ధిదారులతో నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని తెలిపారు. సకాలంలో నిర్మాణాలు పూర్తి చేసి, సామూహిక గృహనిర్మాణాలకు లబ్ధిదారులను సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వి.చిన్నంనాయుడు, హౌసింగ్ ఏఈ వేణుగోపాలరావు పాల్గొన్నారు.

ఇంటింటా ఫీవర్ సర్వే

రేగిడి: మండలంలోని రేగిడి, బూరాడ పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో ఇంటింటా ఫీవర్ సర్వే చేస్తున్నారు. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ఇంటింటికీ వెళ్లి, జ్వరాలతో బాధపడుతున్న వారి వివరాలు సేకరిస్తున్నారు. అనంతరం వారి రక్తనమూనాలు తీసుకుని, ల్యాబ్‌కు పంపిస్తున్నారు. అలాగే అవసరమైన వైద్య సలహాలు, సూచనలు, మందులు అందజేస్తున్నారు.

30 యూనిట్ల రక్తం సేకరణ

రాజాం సిటీ: స్థానిక నటరాజ కల్యాణ మండపంలో సినీ హీరో, మెగాస్టార్ చిరంజీవి అభిమానులు శనివారం రక్తదానం చేశారు. ఈ నెల 22వ తేదీన చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా వారు రక్తం దానం చేసినట్లు రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్ కుమార్, పెంకి చైతన్యకుమార్ తెలిపారు. మొత్తం 30 యూనిట్ల రక్తం సేకరించినట్లు పేర్కొన్నారు.

చురుగ్గా ఓటర్ సర్వే

సంతకవిటి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటా ఓటర్ సర్వే కార్యక్రమం చాలా చురుగ్గా కొనసాగుతోంది. తహసీల్దార్ ఎ.సులోచనారాణి శనివారం విలేకరులతో మాట్లాడుతూ 2024 ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, పక్కాగా ఓటరు జాబితా తయారు చేస్తున్నామన్నారు. ఓటరు జాబితాలో కొత్త ఓటర్ల చేర్పు, మృతి చెందిన ఓటర్ల తొలగింపుతో పాటు ఓటర్ల వివరాలు సమగ్రంగా నమోదు చేస్తున్నామన్నారు.

షిర్డీసాయిబాబాకు ప్రత్యేక పూజలు

బాడంగి: మండల కేంద్రానికి సమీపంలోని ముగడ కాలనీలో షిర్డీసాయిబాబాకు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయితత్వ ప్రచారకులు అమ్ముల సాంబశివరావు పుట్టినరోజు సందర్భంగా గొట్టాపు కృష్ణమూర్తి ఇంట్లో బాబాకు పుష్పాభిషేకం చేశారు.

పండ్లు, రొట్టెల పంపిణీ

బొబ్బిలి: స్థానిక సీహెచ్‌సీలోని రోగులకు అక్కడి వైద్యుల చేతులమీదుగా వీర బొబ్బిలి ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ సభ్యులు శనివారం పండ్లు, రొట్టెలు అందజేశారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా వీటిని పంపిణీ చేసినట్లు అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు సన్యాసిరావు తెలిపారు.

నిత్యాన్నదాన కార్యక్రమం ప్రారంభం

రాజాం సిటీ: స్థానిక మాధవబజార్‌లోని భగీరథ డిపార్ట్‌మెంట్ వద్ద నిత్యాన్నదాన కార్యక్రమం శనివారం ప్రారంభించారు. పేదలు, సాధువులు, బాటసారుల ఆకలి తీర్చాలన్న సంకల్పంతోనే ఈ కార్యక్రమం చేపడుతున్నామని వాసవీ క్లబ్ మనరాజాం–సారథి సభ్యులు తెలిపారు. పెళ్లిళ్లు, పుట్టినరోజులు, ఇతర కార్యక్రమాలు పురస్కరించుకుని, ఎవరైనా అన్నదానం చేయవచ్చన్నారు.

ఆధార్ అనుసంధానం చేసుకోండి

బొబ్బిలి: విద్యుత్ డివిజన్ పరిధిలోని 8 మండలాల విద్యుత్ వినియోగదారులు మీ ఆధార్ నంబర్‌ను మీ సర్వీసు నంబర్‌తో అనుసంధానం చేసుకోండి అని ఏఈ సాంబశివరావు తెలిపారు. ఈ నెల బిల్లు చెల్లించినపుడు లైన్‌మన్, బిల్ కలెక్టర్, సెక్షన్ కార్యాలయాల వద్ద ఆధార్ అనుసంధానం చేసుకోవచ్చన్నారు.

సంగమేశ్వరాలయంలో డీఎస్పీ పూజలు

వంగర: స్థానిక సంగమేశ్వరాలయంలో చీపురుపల్లి డీఎస్పీ ఎ.ఎస్.చక్రవర్తి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు సిద్ధాంతం గణపతిరావు స్వాగతం పలికి, పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందించారు.

విద్యార్థులకు అభినందనలు

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకుని, విజయవాడ వీఐటీ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ విద్యనభ్యసించేందుకు ఉచిత సీటు పొందిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఉరిటి జగదీష్‌కుమార్ శనివారం అభినందించారు. ఈ ఏడాది ద్వితీయ సంవత్సరంలో ఫలితాల్లో కానూరి తేజశ్వని(965 మార్కులు), బొడ్డేపల్లి జగన్నాథం(957 మార్కులు) సాధించి, చక్కని ప్రతిభ కనబర్చారన్నారు. వీరిరువురూ విజయవాడ వీఐటీ యూనివర్సిటీలో బీటెక్ చదివేందుకు ఉచిత సౌకర్యాలతో పాటు సీటు పొందడం ఆనందంగా ఉందన్నారు.